PRGI No. APTEL/2010/31893

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

మంగళవారం, జూన్ 23, 2026

AP & TG

సంపుటి : 16 (Vallume : 16) | సంచిక : 19 (Issue: 19) | పేజీలు : 4 (Pages : 4) | వెల : రూ 2.00/- (Rs : 2.00/-)

## ముఖ్యమంత్రి హోదాలో విజయ్ తొలి జన్మదినం..



### శుభాకాంక్షల వెల్లువ

**రాజకీయ, సినీ ప్రముఖుల అభినందనలు**

**ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ, స్టాలిన్, పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు**

2



## చిరంజీవితో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు భేటీ

మోదీ 12 ఏళ్ల పాలనపై పుస్తకాల అందజేత

హైదరాబాద్‌లో చిరంజీవి నివాసంలో మర్యాదపూర్వక సమావేశం


రాజకీయ, సినీ వర్గాల్లో ఆసక్తికర చర్చ

భవిష్యత్ రాజకీయ సమీకరణాలపై ఊహాగానాలు

మర్యాదపూర్వక భేటీయా? లేక కొత్త సంకేతాలా?

2

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు కీలక ముందడుగు



## స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రణాళికా విభాగం అవగాహనా ఒప్పందం

15 శాతం వృద్ధి రేటే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు

ఆర్థిక నిర్వహణ పరిశోధనా సంస్థతో అవగాహనా ఒప్పందం

పది సూత్రాల అమలుకు ప్రత్యేక కార్యబృందాలు

కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం



**స్వర్ణాంధ్ర–2047 లక్ష్యాల సాధన దిశగా ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. రాష్ట్రానికి 15 శాతం వృద్ధి రేటు సాధించడమే లక్ష్యమని ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రకటించారు. ఈ లక్ష్య సాధన కోసం రాష్ట్ర ప్రణాళికా విభాగం, ఆర్థిక నిర్వహణ పరిశోధనా సంస్థ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. పది సూత్రాల అమలుకు ప్రత్యేక కార్యబృందాలు ఏర్పాటుచేయనున్నారు. కృత్రిమ మేధ, క్వాంటం టెక్నాలజీ వంటి ఆధునిక రంగాలకు ప్రభుత్వం ప్రాధాన్యం ఇస్తోంది.**

**- కొత్తస్వరం న్యూస్, అమరావతి**

2

## ఓటు, సీట్ల చోరీలో బీజేపీ నిమగ్నం: మహేశ్ కుమార్ గౌడ్

**ఓట్ల తొలగింపుకే సర్ ప్రక్రియ ప్రాధాన్యం అని విమర్శ**

**ఎన్నికలు ఎప్పుడైనా కాంగ్రెస్‌కు వంద సీట్లు ఖాయమని ధీమా**




2



## వాహన తనిఖీల్లో విషాదం..

లారీ ఢీకొని డీటీఓ వెంకన్న మృతి

భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన..

విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయిన అధికారి

2



## డబ్బుల లేమితో చికిత్స ఆగకూడదు: బాలకృష్ణ

రజతోత్సవ వేడుకల్లో బసవతారకం ఆసుపత్రి సేవల ప్రశంస

చంద్రబాబు, వెంకయ్యనాయుడు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల హాజరు

2

## ఏపీ రోడ్లపై రక్తపాతం..

వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి

ప్రకాశం జిల్లాలో ముగ్గురు..

తిరుపతి జిల్లాలో ఇద్దరు దుర్మరణం

2



## కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ

కిషన్ రెడ్డితో కలిసి వెళ్లిన రేవంత్

మెట్రో రెండోదశ విస్తరణ తదితర ప్రాజెక్టులపై చర్చ

**న్యూఢిల్లీ, జూన్ 22 (కొత్తస్వరం) :**

తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి ఢిల్లీ పర్యటన కొనసాగుతోంది. పర్యటనలో భాగంగా రైల్వే మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో సీఎం భేటీ అయ్యారు. కేంద్రమంత్రి కిషన్‌రెడ్డితో కలిసి రైల్వేమంత్రితో రైల్ భవన్‌లో ఆయన సమావేశమయ్యారు. హైదరాబాద్ మెట్రో రైలు ఫేజ్`2 అనుమతులపై వారు చర్చించారు. ఐఆరఎఫ్‌సీ రుణ నిధుల విడుదలపైనా నేతలు సమీక్షించినట్టు సమాచారం. ఇటీవల కిషన్‌రెడ్డికి రేవంత్‌రెడ్డి బహిరంగ లేఖ రాశారు. హైదరాబాద్ మెట్రో రైలుకు ఐఆరఎఫ్‌సీ రుణం త్వరగా వచ్చేలా చూడాలని కోరారు. రైల్వేమంత్రితో భేటీ ఏర్పాటు చేయించాలని కోరారు. ఈ క్రమంలో తాజా సమావేశానికి ప్రాధాన్యం ఏర్పడింది. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్ట్ టేకోవర్, మెట్రో ఫేజ్ 2 విస్తరణ, ఐఆరఎఫ్‌సీ పెండింగ్ నిధులు గురించి ఈ సమావేశంలో చర్చించనున్నారు. హైదరాబాద్ మెట్రో రైల్ ప్రాజెక్టుపై సీఎం రేవంత్ రెడ్డి, కిషన్ రెడ్డి మధ్య డైలాగ్ వార్ జరుగుతోన్న వేళ ఈ భేటీకి ప్రాధ్యానత సంతరించుకుంది. హైదరాబాద్ మెట్రో ప్రాజెక్టుకు సంబంధించి సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి మధ్య మాటల యుద్ధం నడుస్తోన్న విషయం తెలిసిందే. ఇరువురు ఒకరిపై ఒకరు విమర్శలు వర్షం కురిపించుకుంటున్నారు. కిషన్ రెడ్డి వల్లే హైదరాబాద్ మెట్రో ఫేజ్ 2 ప్రాజెక్ట్ ఆగిపోయిందని సీఎం రేవంత్ రెడ్డి ఆరోపించగా.. తన వల్ల తెలంగాణకు రావాల్సిన ఏ ప్రాజెక్ట్ ఆగిపోలేదని కిషన్ రెడ్డి కౌంటర్ ఇచ్చారు. అయితే, హైదరాబాద్ మెట్రో ప్రాజెక్ట్ ఫేజ్ 2 అనుమతులు, పెండింగ్ నిధులపై చర్చించేందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ అరేంజ్ చేయాలని కిషన్ రెడ్డిని సీఎం రేవంత్ కోరారు. సీఎం అభ్యర్థనపై సానుకూలంగా స్పందించిన కిషన్ రెడ్డి.. సోమవారం కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్‌తో మీటింగ్ సెట్ చేశారు. ఈ సమావేశంలో ఆయన కూడా పాల్గొన్నారు. ఉప్పు నిప్పులా ఉన్న ఇద్దరు నేతలు ఒకే గదిలో కూర్చొని చర్చించడం తెలంగాణ రాజకీయాల్లో హాట్ టాపిక్‌గా మారింది.

## చిట్టినాయుడిని వదిలిపెట్టే ప్రసక్తే లేదు

**ఇబ్బంది పెట్టిన ప్రతి ఒక్కరికీ సమాధానం ఇస్తా**

**వర్ధన్నపేట కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ ఘాటు హెచ్చరికలు**

**వరంగల్, జూన్ 22 (కొత్త స్వరం):**

వచ్చే ఐదేళ్లలో తమను ఇబ్బంది పెట్టిన వారిని ఎవరినీ మరిచిపోమని, ముఖ్యంగా ముఖ్యమంత్రి చిట్టినాయుడిని అస్సలు వదిలిపెట్టబోమని బీఆరఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ ఘాటుగా హెచ్చరించారు. వర్ధన్నపేట నియోజకవర్గ బీఆరెస్ పార్టీ ముఖ్య కార్యకర్తల సమావేశంలో కేటీఆర్ పాల్గొన్నారు. మాజీ ఎమ్మెల్యే ఆరూరి రమేశ్‌తో పాటు నియోజకవర్గానికి చెందిన నాయకులు, పార్టీ శ్రేణులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. ఈ సందర్భంగా కేటీఆర్ మాట్లాడుతూ, "వచ్చే ఐదేళ్లు ఏదీ మర్చిపోము. మనల్ని ఇబ్బంది పెట్టిన వారిని మర్చిపోము. మనపై కేసులు పెట్టిన వారిని మరిచిపోము. మనతో నిలబడ్డ వారిని కూడా మరిచిపోము" అని అన్నారు. "నేను కేసీఆర్‌లా అంత మృదువుగా ఉండను. వచ్చే ఐదేళ్లు చిట్టినాయుడు, ఆయన బృందానికి తగిన సమాధానం చెప్పే బాధ్యత నాది. పదవీ విరమణ చేసినా, పారిపోయినా, ఎక్కడ దాక్కున్నా మా కార్యకర్తలను వేధించిన ప్రతి ఒక్కరినీ వెతికి తీసుకొచ్చి ప్రజల ముందుంచుతాం" అని స్పష్టం చేశారు. ఇది తాను సాధారణంగా చెప్పడం కాదని, మాట నిలబెట్టుకుంటానని కేటీఆర్ పేర్కొన్నారు. అలాగే ఆరూరి రమేశ్‌ను ఉద్దేశించి, "వాళ్లు మంచివాళ్లు అన్న కారణంతో మళ్లీ పార్టీలోకి తీసుకురావద్దు" అంటూ సూచించారు.






## గిరిజన సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొలుసు పార్థసారథి

గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం

గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి

స్వర్ణగ్రామ సచివాలయాల్లో అభివృద్ధి వివరాలు ప్రదర్శించాలని ఆదేశం

పోలవరం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం

గిరిజన యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి

2

# స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు కీలక ముందడుగు

**స్వర్ణాంధ్ర లక్ష్యాల సాధనకు ప్రణాళికా విభాగం అవగాహనా ఒప్పందం**
**15 శాతం వృద్ధి రేటే లక్ష్యమన్న ముఖ్యమంత్రి చంద్రబాబు**
**ఆర్థిక నిర్వహణ పరిశోధనా సంస్థతో అవగాహనా ఒప్పందం**
**పది సూత్రాల అమలుకు ప్రత్యేక కార్యబృందాలు**
**కృత్రిమ మేధ, ఆధునిక సాంకేతిక రంగాలకు ప్రోత్సాహం**



**అమరావతి, జూన్ 22 (కొత్త స్వరం):**
స్వర్ణాంధ్ర 2047 దృష్టిపత్రంలో భాగంగా రాష్ట్రానికి 15 శాతం వృద్ధి రేటు లక్ష్యంగా పెట్టుకున్నామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేశారు. 2014 నుంచి 2019 మధ్య 13.5 శాతం సమ్మిళిత వార్షిక వృద్ధి రేటు సాధించామని, పలు కారణాల వల్ల ప్రస్తుతం 11 శాతం వృద్ధి రేటు నమోదైందని తెలిపారు. సచివాలయంలో ముఖ్యమంత్రి సమక్షంలో రాష్ట్ర ప్రణాళికా విభాగం మరియు కేఆర్ఈఏ విశ్వవిద్యాలయం ఆధ్వర్యంలోని ఆర్థిక నిర్వహణ పరిశోధనా సంస్థ మధ్య అవగాహనా ఒప్పందం కుదిరింది. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాల సాధనలో భాగంగా పది సూత్రాల అమలుపై ఈ ఒప్పందం జరిగింది. రాష్ట్ర ప్రణాళికా విభాగం ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్, సంస్థ ప్రతినిధి కపిల్ విశ్వనాథన్ పరస్పరం ఒప్పంద పత్రాలు మార్చుకున్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి, వృద్ధి రేటు సాధనలో పది సూత్రాల కోసం ప్రత్యేక కార్య విభాగాల ఏర్పాటు, కార్యక్రమాల అమలుపై ఈ సంస్థ పర్యవేక్షణ చేయనుంది. సున్నా పేదరిక లక్ష్యం, జల భద్రత, లోతైన సాంకేతిక మిషన్ల వంటి అంశాలపై ఈ సంస్థ ప్రభుత్వంతో కలిసి పనిచేయనుంది. క్షేత్రస్థాయి అధ్యయనాలు నిర్వహించి విధానపరమైన సూచనలు అందించడంతో పాటు పది సూత్రాలకు సంబంధించి కొత్త విధానాలను సిఫారసు చేయనుంది. తదుపరి దశల్లో మిగిలిన అంశాలపైనా కార్యాచరణ చేపట్టనున్నారు. రాష్ట్ర స్థాయిలో ప్రత్యేక కమిటీతో పాటు కార్య బృందాలను ఏర్పాటు చేసి అమలును పర్యవేక్షించనున్నట్లు తెలిపారు. రాష్ట్రంలోని వివిధ రంగాల అభివృద్ధికి ఆధునిక సాంకేతికతను సమన్వయం చేస్తున్నామని ముఖ్యమంత్రి వెల్లడించారు. కృత్రిమ మేధ నైపుణ్యాభివృద్ధి, డ్రోన్ మ్యాపింగ్, వాహన తయారీ, లోహాలు, ఉక్కు, అరుదైన ఖనిజాలు, అర్ధవాహక చిప్‌లు, రక్షణ రంగాల్లో పలు ప్రాజెక్టులు ఆంధ్రప్రదేశ్‌కు వచ్చాయని పేర్కొన్నారు. కృత్రిమ మేధతో పాటు క్వాంటం సాంకేతికతను కూడా రాష్ట్రంలో విస్తృతంగా ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మంత్రి పయ్యావుల కేశవ్, కేఆర్ఈఏ ప్రతినిధులు, ఆర్థిక నిర్వహణ పరిశోధనా సంస్థ సభ్యులు, ప్రణాళికా విభాగం అధికారులు పాల్గొన్నారు.

# ఏపీ రోడ్లపై రక్తపాతం..

**వేర్వేరు ప్రమాదాల్లో ఐదుగురు మృతి**
**ప్రకాశం జిల్లాలో ముగ్గురు.. - తిరుపతి జిల్లాలో ఇద్దరు దుర్మరణం**

**తిరుపతి, జూన్ 22 (కొత్త స్వరం):**
ఆంధ్రప్రదేశ్‌లో వేర్వేరు రోడ్డు ప్రమాదాలు విషాదాన్ని మిగిల్చాయి. ప్రకాశం, తిరుపతి జిల్లాల్లో జరిగిన రెండు ఘోర ప్రమాదాల్లో మొత్తం ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. పలువురు తీవ్రంగా గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్నారు. ప్రకాశం జిల్లా సంతమాగులూరు మండలం కామేపల్లి సమీపంలో ఆటోను లారీ ఢీకొట్టడంతో ఘోర ప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ముగ్గురు మృతి చెందారు. శావల్యాపురం మండలం వేల్పూరు గ్రామానికి చెందిన పది మంది నాదెండ్ల మండలం సంకురాత్రిపాడులో జరిగే దశదిన కర్మకు హాజరయ్యేందుకు ఆటోలో బయల్దేరారు. కామేపల్లి రైల్వే అండర్‌పాస్ సమీపానికి రాగానే గ్రానైట్‌తో వెళ్తున్న లారీ మలుపు తిరుగుతూ ఆటోను బలంగా ఢీకొట్టింది. ప్రమాదంలో ఏడుకొండలు (60), రమణమ్మ (50) అక్కడికక్కడే మృతి చెందగా, గాయపడిన వారిలో సుబ్బాయమ్మ (70) ఆసుపత్రిలో చికిత్స పొందుతూ కన్నుమూశారు. మరో ఏడుగురికి గాయాలయ్యాయి. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఇక తిరుపతి జిల్లా పుల్లంపేట మండలం ఉడుంవారిపల్లి వద్ద సోమవారం తెల్లవారుజామున మరో ఘోర ప్రమాదం జరిగింది. ఆర్టీసీ బస్సును లారీ ఢీకొట్టడంతో ఇద్దరు మృతి చెందగా, 15 మందికి తీవ్ర గాయాలయ్యాయి. తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న బస్సును, ఎర్రగుంట్ల నుంచి చెన్నైకి వెళ్తున్న లారీ ఢీకొట్టింది. ప్రమాదంలో ఏడాది వయసున్న చిన్నారి సంఘటన స్థలంలోనే మృతి చెందాడు. పలువురికి తీవ్ర గాయాలు కాగా, రోడ్డు మొత్తం రక్తసిక్తమైంది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. క్షతగాత్రులను అంబులెన్సుల ద్వారా రాజంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం మెరుగైన చికిత్స కోసం రిమ్స్‌కు తరలించగా, కె. జస్విక (16) అనే బాలిక చికిత్స పొందుతూ మృతి చెందింది. పోలీసులు కేసు నమోదు చేసి ప్రమాదాలపై దర్యాప్తు కొనసాగిస్తున్నారు.

# వాహన తనిఖీల్లో విషాదం..

**లారీ ఢీకొని డీటీఓ వెంకన్న మృతి**
**భూపాలపల్లి జిల్లాలో దుర్ఘటన..**
**విధి నిర్వహణలోనే ప్రాణాలు కోల్పోయిన అధికారి**

**జయశంకర్ భూపాలపల్లి, జూన్ 22 (కొత్త స్వరం):**



జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో విషాదకర ఘటన చోటుచేసుకుంది. గణపురం మండలం చెల్పూరు శివారులో సోమవారం వాహనాల తనిఖీలు నిర్వహిస్తున్న జిల్లా రవాణా అధికారి వెంకన్నపై బొగ్గు లోడుతో వెళ్తున్న లారీ అదుపుతప్పి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో వెంకన్న తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతి చెందారు. రవాణా శాఖ కార్యాలయం ఎదుట సాధారణ తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో ఈ ఘటన జరగడంతో స్థానికంగా తీవ్ర కలకలం రేగింది. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం ఆస్పత్రికి తరలించారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. డీటీఓ వెంకన్న మృతి పట్ల పొన్నం ప్రభాకర్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. వెంకన్న కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ, విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోవడం ఎంతో బాధాకరమని పేర్కొన్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

# ముఖ్యమంత్రి హోదాలో విజయ్ తొలి జన్మదినం..

**శుభాకాంక్షల వెల్లువ**
**రాజకీయ, సినీ ప్రముఖుల అభినందనలు**
**ప్రధాని మోదీ, రాహుల్ గాంధీ, స్టాలిన్, పవన్ కల్యాణ్ శుభాకాంక్షలు**

**చెన్నై, జూన్ 22 (కొత్త స్వరం):**
తమిళనాడు రాజకీయాల్లో సంచలనం సృష్టించి, తొలి ఎన్నికల పోటీలోనే విజయం సాధించిన ముఖ్యమంత్రి విజయ్ సోమవారం తన తొలి జన్మదినాన్ని ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా రాజకీయ, సినీ ప్రముఖుల నుంచి శుభాకాంక్షల వెల్లువ కొనసాగింది. అభిమానులు ఆదివారం అర్ధరాత్రి శివకాశిలో గంటసేపు బాణాసంచా కాల్చి సంబరాలు జరిపారు. ప్రధాని మోదీ సామాజిక మాధ్యమం వేదికగా విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయన దీర్ఘాయుష్షుతో ఆరోగ్యంగా ఉండాలని ఆకాంక్షించారు. రాహుల్ గాంధీ విజయ్‌కు శుభాకాంక్షలు తెలియజేస్తూ, తమిళ ప్రజల హక్కులు, గౌరవం, ఆకాంక్షలను పరిరక్షించే ప్రతి ప్రయత్నంలో తాను అండగా ఉంటానని పేర్కొన్నారు. ఏపీ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ విజయ్ ఆరోగ్యంగా, ఆనందంగా ఉండాలని కోరుతూ, ప్రజాసేవలో మరిన్ని విజయాలు సాధించాలని ఆకాంక్షించారు. తమిళనాడు మాజీ ముఖ్యమంత్రి స్టాలిన్ విజయ్ ఎల్లప్పుడూ ఆరోగ్యంతో ఉండాలని, ప్రజలకు సేవ చేయడానికి కావాల్సిన శక్తి లభించాలని ఆశీర్వదించారు. ప్రముఖ నటుడు కమల్ హాసన్ "కోట్లాది అభిమానుల ప్రేమను పొందిన తమ్ముడు విజయ్‌కు జన్మదిన శుభాకాంక్షలు" అని పేర్కొన్నారు. నటి నయనతార ఈ సంవత్సరం విజయ్‌కు మరింత విజయవంతంగా ఉండాలని ఆకాంక్షించగా, నటి ఖుష్బూ తన సోదరుడిలాంటి విజయ్‌కు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలిపారు.

# గిరిజన సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం: మంత్రి కొలుసు పార్థసారథి





**గిరిజన సమస్యల పరిష్కారానికి ప్రత్యేక ప్రాధాన్యం**
**గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి**
**స్వర్ణగ్రామ సచివాలయాల్లో అభివృద్ధి వివరాలు ప్రదర్శించాలని ఆదేశం**
**పోలవరం నియోజకవర్గ అభివృద్ధిపై సమీక్షా సమావేశం**
**గిరిజన యువతకు ఉపాధి, నైపుణ్యాభివృద్ధిపై దృష్టి**

**ఏలూరు/బుట్టాయిగూడెం, జూన్ 22 (కొత్త స్వరం):**
దేశ సంపదను కాపాడే గిరిజనుల సంక్షేమమే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. గిరిజన ప్రాంతాల అభివృద్ధి, సంక్షేమానికి అధికారులు తొలి ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన స్పష్టం చేశారు. బుట్టాయిగూడెం మండలం కోటరామచంద్రపురంలోని సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయ సమావేశ మందిరంలో పోలవరం ఎమ్మెల్యే చిర్రి బాలరాజు, ట్రైకార్ ఛైర్మన్ బోరగం శ్రీనివాస రావు, సంబంధిత అధికారులతో కలిసి మంత్రి అధ్యక్షతన పోలవరం నియోజకవర్గ సమీక్షా సమావేశం నిర్వహించారు. శాఖలు, మండలాల వారీగా గత రెండేళ్లలో జరిగిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు, పూర్తయిన పనులు, పెండింగులో ఉన్న పనులను మంత్రి సమీక్షించారు. అనంతరం ప్రజల నుంచి వినతిపత్రాలను స్వీకరించారు. ఈ సందర్భంగా స్వర్ణ పోలవరం వార్తా పుస్తకాలను ఆవిష్కరించగా, అంగన్వాడీ కేంద్రాలకు విద్యుత్ పొయ్యిలను అందజేశారు. మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సూచనల మేరకు ప్రతి కుటుంబంలో కనీసం ఒకరికి ఉపాధి కల్పించేలా కార్యాచరణ సిద్ధం చేసి అమలు చేయాలని సూచించారు. రాష్ట్రవ్యాప్తంగా ఒకేరోజు 13 వేల గ్రామ సభలు నిర్వహించి గ్రామ స్వరాజ్య సాధనకు ప్రత్యేక చర్యలు చేపట్టామని తెలిపారు. రాష్ట్రంలో 7 వేల కిలోమీటర్ల సిమెంట్ రహదారులు నిర్మించామని పేర్కొన్నారు. పోలవరం ప్రాజెక్టుకు సంబంధించిన పునరావాస సమస్యలను వేగంగా పరిష్కరించాలని, గిరిజన ప్రాంతంలోని ఏడు మండలాల్లో ఉపాధి హామీ పథకం కింద 30 కోట్ల రూపాయలతో చేపడుతున్న రహదారి పనులను నాణ్యతతో, నిర్ణీత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. గత ఐదేళ్లలో జరిగిన అభివృద్ధి, గత రెండేళ్లలో అమలైన సంక్షేమ కార్యక్రమాల పూర్తి వివరాలను అందరికీ తెలిసేలా స్వర్ణగ్రామ సచివాలయాల్లో ప్రదర్శించాలని సూచించారు. గిరిజనులకు రాజ్యాంగబద్ధ హక్కులు, సంక్షేమ పథకాల ప్రయోజనాలు సక్రమంగా అందేలా చూడాల్సిన బాధ్యత అందరిదని తెలిపారు. ప్రజా ఫిర్యాదుల పరిష్కార వ్యవస్థలో వచ్చిన వినతులను త్వరితగతిన పరిష్కరించాలని అన్నారు. విద్యుత్ సౌకర్యం లేని రెండు మండలాల్లో మూడు గ్రామాలకు సౌర విద్యుత్ అందించడం శుభపరిణామమని అభినందించారు. ప్రతి గిరిజన ఇంటికీ సౌర పలకలు ఏర్పాటు చేసే దిశగా అవగాహన కల్పించాలని సూచించారు. గిరిజన ప్రాంతాల్లో గృహాల కోసం వచ్చిన దరఖాస్తులను పరిశీలించి మంజూరుకు చర్యలు తీసుకోవాలని, నిరుద్యోగ యువతకు పరిశ్రమల స్థాపనలో సహకరించాలని, ఉద్యోగ మేళాల ద్వారా ఉపాధి అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు. తక్కువ విద్యార్హతలున్న యువతకు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు నిర్వహించి ఉపాధి అవకాశాలు పెంచాలని అన్నారు. పశువులు, మేకలు, గొర్రెల పెంపకానికి రుణాలు కోరిన గిరిజనులకు ఈ ఆర్థిక సంవత్సరంలో నూటికి నూరుశాతం రుణాలు మంజూరు చేయాలని స్పష్టం చేశారు. మహిళా సంఘాలకు వివిధ వ్యాపారాల కోసం బ్యాంకు రుణాలు ఉదారంగా మంజూరు చేసేలా అధికారులు కృషి చేయాలని సూచించారు. ఎమ్మెల్యే చిర్రి బాలరాజు మాట్లాడుతూ, కూటమి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులైన ప్రతి లబ్ధిదారునికి చేరేలా అధికారులు సమన్వయంతో పనిచేయాలని అన్నారు. ప్రజల సమస్యలను పారదర్శకంగా, త్వరితగతిన పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిషత్ ప్రధాన కార్యనిర్వాహణ అధికారి జగదాంబ, రెవెన్యూ విభాగాధికారి రమణ, ప్రత్యేక ఉప కలెక్టర్ కిషోర్, పలు శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, గిరిజన సంఘాల నాయకులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

# డబ్బుల లేమితో చికిత్స ఆగకూడదు: బాలకృష్ణ

**రజతోత్సవ వేడుకల్లో బసవతారకం ఆసుపత్రి సేవల ప్రశంస**
**చంద్రబాబు, వెంకయ్యనాయుడు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యుల హాజరు**

**హైదరాబాద్, జూన్ 22 (కొత్త స్వరం):**
పేదలకు అండగా నిలవాలనే మహత్తర లక్ష్యంతో బసవతారకం ఇండో-అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రిని ప్రారంభించామని ఆసుపత్రి ఛైర్మన్, ఎమ్మెల్యే బాలకృష్ణ తెలిపారు. డబ్బుల లేమి కారణంగా ఏ ఒక్కరూ క్యాన్సర్ చికిత్సకు దూరం కాకూడదనే సంకల్పంతో ఆసుపత్రి సేవలు కొనసాగుతున్నాయని చెప్పారు. బసవతారకం క్యాన్సర్ ఆసుపత్రి రజతోత్సవ వేడుకలు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్యనాయుడు, కేంద్ర మంత్రులు అనుప్రియా పటేల్, పెమ్మసాని చంద్రశేఖర్, తెలంగాణ మంత్రి దామోదర రాజనర్సింహ, ఏపీ మంత్రి సత్యకుమార్‌తో పాటు వివిధ రంగాలకు చెందిన ప్రముఖులు, ఎన్టీఆర్ కుటుంబ సభ్యులు హాజరయ్యారు. ఈ సందర్భంగా బాలకృష్ణ మాట్లాడుతూ, తాను నటుడిగా లేదా ఎమ్మెల్యేగా కాకుండా ఒక కొడుకుగా ప్రజల ముందున్నానని అన్నారు. తన తల్లి బసవతారకం క్యాన్సర్ బారిన పడిన సమయంలో కుటుంబం ఎదుర్కొన్న బాధను గుర్తుచేసుకున్నారు. డబ్బు ఉన్నవారు చికిత్స పొందగలిగినా, పేదల పరిస్థితి ఏమిటన్న ఆలోచనే ఈ ఆసుపత్రి స్థాపనకు కారణమైందని తెలిపారు. ఇప్పటివరకు 3.75 లక్షల మందికి బాహ్య రోగ సేవలు అందించామని, రోజుకు 35 నుంచి 40 శస్త్రచికిత్సలు నిర్వహిస్తున్నామని వెల్లడించారు. బాధతో ఆసుపత్రికి వచ్చే రోగులు చిరునవ్వుతో తిరిగి వెళ్లాలన్నదే తమ లక్ష్యమన్నారు. దేశంలోనే తొలి ఎముక మజ్జ మార్పిడి కేంద్రాన్ని ఇక్కడ ప్రారంభించామని పేర్కొన్నారు. ప్రభుత్వాలు, దాతలు, సేవాసంస్థలు అందించిన సహకారం వల్లే ఆసుపత్రి ఈ స్థాయికి చేరుకుందని బాలకృష్ణ చెప్పారు. 25 ఏళ్ల క్రితం చేసిన వాగ్దానాన్ని నిలబెట్టుకున్నామని, భవిష్యత్తులో కూడా సేవలను మరింత విస్తరిస్తామని స్పష్టం చేశారు. అమరావతిలో కొత్త క్యాన్సర్ ఆసుపత్రి నిర్మాణంతో పాటు హైదరాబాద్‌లో సేవలను మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. రజతోత్సవ వేడుకల్లో ఆసుపత్రి సేవా ప్రస్థానం, వైద్య సేవలు, భవిష్యత్ విస్తరణ ప్రణాళికలపై చర్చించారు. క్యాన్సర్ చికిత్స రంగంలో బసవతారకం ఆసుపత్రి అందిస్తున్న సేవలు ఆదర్శప్రాయమని అతిథులు కొనియాడారు.

# చిరంజీవితో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు భేటీ

**హైదరాబాద్, జూన్ 22 (కొత్త స్వరం):**
తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో ఆసక్తికర పరిణామం చోటుచేసుకుంది. చిరంజీవిను భారతీయ జనతా పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ భేటీకి సంబంధించిన చిత్రాలు సామాజిక మాధ్యమాల్లో విస్తృతంగా ప్రచారంలోకి రావడంతో రాజకీయ, సినీ వర్గాల్లో చర్చ మొదలైంది. గత కొన్నేళ్లుగా ప్రత్యక్ష రాజకీయాలకు దూరంగా ఉంటూ సినిమాలపైనే దృష్టి సారించిన చిరంజీవిని భాజపా కీలక నాయకుడు కలవడం వెనుక ఉద్దేశం ఏమిటనే అంశంపై పలు ఊహాగానాలు వ్యక్తమవుతున్నాయి. భాజపా వర్గాల సమాచారం ప్రకారం, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 ఏళ్ల పాలన పూర్తి చేసుకున్న సందర్భంగా దేశవ్యాప్తంగా మహాజన సంపర్క్ కార్యక్రమాన్ని నిర్వహిస్తోంది. ఈ కార్యక్రమం ద్వారా కేంద్ర ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలు, ఆర్థిక సంస్కరణలను వివిధ రంగాల ప్రముఖులకు వివరించే ప్రయత్నం జరుగుతోంది. ఆ కార్యక్రమంలో భాగంగానే రామచందర్ రావు చిరంజీవిని కలిసి మోదీ ప్రభుత్వ పనితీరుకు సంబంధించిన ప్రత్యేక పుస్తకాలు, ప్రచార పత్రాలను అందజేసినట్లు తెలుస్తోంది. ఈ సందర్భంగా దేశ అభివృద్ధి, ఆర్థిక ప్రగతి, సామాజిక రంగాల్లో జరిగిన మార్పులపై ఇద్దరి మధ్య చర్చ జరిగినట్లు సమాచారం. అధికారికంగా ఇది మర్యాదపూర్వక భేటీగా చెబుతున్నప్పటికీ, రాజకీయ వర్గాల్లో మాత్రం పలు విశ్లేషణలు కొనసాగుతున్నాయి. గతంలో ప్రజారాజ్యం పార్టీని స్థాపించి రాజకీయాల్లో కీలక పాత్ర పోషించిన చిరంజీవి, అనంతరం ఆ పార్టీని కాంగ్రెస్‌లో విలీనం చేసి కేంద్ర మంత్రిగా పనిచేశారు. ఆ తర్వాత రాజకీయాలకు దూరంగా ఉన్న ఆయన మళ్లీ క్రియాశీల రాజకీయాల్లోకి వస్తారా? అనే ప్రశ్న మరోసారి ముందుకు వచ్చింది. ముఖ్యంగా భాజపాతో ఆయన సాన్నిహిత్యం పెరుగుతుందా అనే అంశంపై కూడా చర్చ జరుగుతోంది. చిరంజీవి తమ్ముడు, జనసేన పార్టీ అధినేత పవన్ కల్యాణ్ ప్రస్తుతం జాతీయ ప్రజాస్వామ్య కూటమిలో కీలక భాగస్వామిగా కొనసాగుతున్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వంలో ఉప ముఖ్యమంత్రిగా బాధ్యతలు నిర్వహిస్తున్న పవన్ కల్యాణ్‌కు భాజపాతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో చిరంజీవి-భాజపా భేటీకి మరింత ప్రాధాన్యం ఏర్పడింది. అయితే ఈ సమావేశం కేవలం మర్యాదపూర్వకంగానే జరిగిందా? లేక భవిష్యత్ రాజకీయ సమీకరణాలకు సంకేతమా? అన్నది ప్రస్తుతం చర్చనీయాంశంగా మారింది.

# ఓటు, సీట్ల చోరీలో బీజేపీ నిమగ్నం: మహేశ్ కుమార్ గౌడ్

**ఓట్ల తొలగింపుకే సర్ ప్రక్రియ ప్రాధాన్యం అని విమర్శ**
**ఎన్నికలు ఎప్పుడైనా కాంగ్రెస్‌కు వంద సీట్లు ఖాయమని ధీమా**

**హనుమకొండ, జూన్ 22 (కొత్త స్వరం):**
దేశంలో సర్ ప్రక్రియ పేరిట ప్రజాస్వామ్యంపై దాడి జరుగుతోందని టీపీసీసీ అధ్యక్షుడు మహేశ్ కుమార్ గౌడ్ ఆరోపించారు. గతంలో ఎప్పుడూ లేని విధంగా ఇప్పుడు ఓటర్ల హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. హనుమకొండలో వరంగల్ పశ్చిమ నియోజకవర్గ బూత్ స్థాయి ప్రతినిధుల శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న ఆయన మాట్లాడుతూ, ఒకప్పుడు ఓటర్లను జాబితాలో చేర్చే కార్యక్రమాలు జరిగేవని, ఇప్పుడు మాత్రం ఓట్లను తొలగించే ప్రక్రియకే ప్రాధాన్యం ఇస్తున్నారని అన్నారు. బెంగాల్‌లో ఓట్ల చోరీ ద్వారా బీజేపీ అడ్డదారిలో గెలిచిందని, ఇప్పుడు ఓట్లే కాదు సీట్ల చోరీకి కూడా పాల్పడుతోందని తీవ్రంగా విమర్శించారు. మీనాక్షి నటరాజన్ రాజ్యసభ నామినేషన్‌ను కావాలనే తిరస్కరించారని ఆరోపిస్తూ, దేశంలో ప్రజాస్వామ్యం, రాజ్యాంగం ఎక్కడున్నాయని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్ కూడా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మహేశ్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ, బీఆర్ఎస్ పాలనలో పదేళ్ల పాటు జరిగిన దోపిడీ, అవినీతిని ప్రజలు మరిచిపోలేదన్నారు. కేటీఆర్ అసత్య ప్రచారాలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం చేస్తున్నారని విమర్శించారు. కాంగ్రెస్ పాలనలో అభివృద్ధి, సంక్షేమం సమానంగా ముందుకు సాగుతున్నాయని పేర్కొంటూ, రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికలు ఎప్పుడైనా జరిగినా కాంగ్రెస్ పార్టీ 100 సీట్లు గెలుచుకోవడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని నరేంద్ర మోదీ, కేంద్ర మంత్రి అమిత్ షా తమ స్వంత అజెండాతో ముందుకెళ్తున్నారని, అందుకే వాస్తవాలను ప్రజలకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. పార్టీ కోసం కష్టపడిన ప్రతి కార్యకర్తకు న్యాయం చేస్తామని, కొంత ఆలస్యం జరిగినా అందరికీ సముచిత గుర్తింపు లభిస్తుందని స్పష్టం చేశారు.




# ఆదిలాబాద్ విమానాశ్రయానికి సంపూర్ణ సహకారం

(మొదటి పేజీ తరువాయి..)
చేసేలా చర్యలు తీసుకోవాలని ముఖ్యమంత్రి కోరారు. ప్రపంచ ప్రఖ్యాత విమానయాన సంస్థలు తమ సేవా కేంద్రాలను ఏర్పాటు చేసుకునేందుకు ఆదిలాబాద్‌ను అనుకూల కేంద్రంగా అభివృద్ధి చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే మహబూబ్‌నగర్ జిల్లా దేవరకద్ర సమీపంలో రక్షణ పరిశోధన సంస్థలు ప్రతిపాదించిన కీలక ప్రాజెక్టును త్వరగా మంజూరు చేయాలని కేంద్ర మంత్రిని కోరారు. ఈ ప్రాజెక్టు రాష్ట్ర అభివృద్ధికి తోడ్పడటంతో పాటు వ్యూహాత్మకంగా కూడా ఎంతో ముఖ్యమని వివరించారు. దాదాపు 20 నిమిషాల పాటు సాగిన ఈ భేటీలో రాష్ట్రాభివృద్ధి, రక్షణ సంబంధిత పలు అంశాలపై ఇరువురు నేతలు విస్తృతంగా చర్చించారు.

# కొత్త స్వరం
తెలుగు దిన పత్రిక
**కర్నూలు - నంద్యాల**
మంగళవారం, జూన్ 23, 2026 | పేజీ 3


## బాలుర వసతి గృహ వార్డెన్‌పై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా: లింగాల నాగరాజు

**వెంకటాపురం వసతి గృహంలో ఆకస్మిక తనిఖీ**

**ఆత్మకూరు, జూన్ 22 (కొత్త స్వరం) :**

వెంకటాపురం ప్రభుత్వ బాలుర వసతి గృహంలో పనిచేస్తున్న వార్డెన్‌పై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని జిల్లా ఎస్సీ, ఎస్టీ విజిలెన్స్ మరియు పర్యవేక్షణ కమిటీ సభ్యుడు లింగాల నాగరాజు హెచ్చరించారు. నంద్యాల జిల్లా ఆత్మకూరు మండలంలోని వెంకటాపురం ప్రభుత్వ బాలుర వసతి గృహాన్ని ఆకస్మికంగా తనిఖీ చేసిన అనంతరం ఆయన మాట్లాడారు. పాఠశాలలు ప్రారంభమై 12 రోజులు గడిచినా ఇప్పటివరకు ఒక్క విద్యార్థి కూడా హాస్టల్‌లో చేరలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రస్తుతం కనిపిస్తున్న కొద్దిమంది విద్యార్థులు ఎన్ఎస్ తండాకు చెందినవారని, వారు కూడా ఇంటి నుంచే రాకపోకలు సాగిస్తున్నారని తెలిపారు. వార్డెన్ రెండు రోజులుగా హాస్టల్‌లో అందుబాటులో లేకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్ఎస్ తండాకు చెందిన 7వ, 8వ, 9వ తరగతుల కొంతమంది విద్యార్థులు గత మూడు నుంచి నాలుగు సంవత్సరాలుగా హాస్టల్‌కు రాకపోయినా, వారి పేర్లు తొలగించకుండా నిర్లక్ష్యం వహిస్తున్నారని ఆరోపించారు. ఈ విషయంపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తానని స్పష్టం చేశారు. అదే విధంగా బాత్రూములు, పరిసర ప్రాంతాల పరిశుభ్రతను పట్టించుకోకపోవడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శుభ్రత పనుల్లో నిర్లక్ష్యం వహిస్తున్న సిబ్బందిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మెనూలో చిత్రాన్నం, పప్పు పచ్చడి ఉండాల్సి ఉండగా, తెల్ల అన్నం మరియు ఉల్లికారం వడ్డించడం ద్వారా విద్యార్థులకు అన్యాయం చేస్తున్నారని మండిపడ్డారు. ఈ అంశాలన్నింటిపై జిల్లా కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లి చర్యలు తీసుకునేలా కృషి చేస్తానని లింగాల నాగరాజు తెలిపారు.





# ప్రగతి పాఠశాలలో.. మాదకద్రవ్యాలపై అవగాహన










విద్యార్థులకు అవగాహన కల్పించిన ఇచ్చోడ సీఐ నరేష్

మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తుకు ముప్పు

చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని సూచన

డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణానికి అందరి సహకారం అవసరం

ప్రతిజ్ఞ చేసిన విద్యార్థులు

**ఆదిలాబాద్ జిల్లా, జూన్ 22 (కొత్త స్వరం) :**


యువతలో పెరుగుతున్న మాదకద్రవ్యాల వినియోగాన్ని అరికట్టేందుకు, విద్యార్థుల్లో అవగాహన పెంపొందించేందుకు ఇచ్చోడ మండల కేంద్రంలోని ప్రగతి పాఠశాలలో మాదకద్రవ్యాల వ్యతిరేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఇచ్చోడ వలయ పరిశీలకుడు నరేష్ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మాదకద్రవ్యాలు యువత భవిష్యత్తును నాశనం చేసే ప్రమాదకరమైన వ్యసనమని అన్నారు. మాదకద్రవ్యాలకు అలవాటు పడితే ఆరోగ్యపరంగా, మానసికంగా, ఆర్థికంగా తీవ్ర నష్టాలు ఎదుర్కోవాల్సి వస్తుందని వివరించారు. విద్యార్థులు చెడు అలవాట్లకు దూరంగా ఉండి, విద్యపై దృష్టి సారించి ఉన్నత లక్ష్యాలను సాధించాలని సూచించారు. అలాగే, అనుమానాస్పద వ్యక్తులు మాదకద్రవ్యాలు విక్రయిస్తున్నట్లు లేదా వినియోగిస్తున్నట్లు తెలిసిన వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని కోరారు. మాదకద్రవ్యాల రహిత సమాజ నిర్మాణంలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని, యువత తమ స్నేహితులను కూడా ఈ వ్యసనాల బారిన పడకుండా చైతన్యపరచాలని పిలుపునిచ్చారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కె. ప్రవీణ్ మాట్లాడుతూ, విద్యార్థుల్లో సామాజిక బాధ్యత పెంపొందించేందుకు ఇలాంటి అవగాహన కార్యక్రమాలు ఎంతో ఉపయోగపడతాయని పేర్కొన్నారు. సీఐ నరేష్ సూచనలను విద్యార్థులు శ్రద్ధగా ఆలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పోలీసు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం విజయవంతంగా ముగియగా, విద్యార్థులు మాదకద్రవ్యాలకు దూరంగా ఉంటామని ప్రతిజ్ఞ చేశారు.

## విద్యార్థులతో పనులా..? ప్రశ్నించిన తండ్రి ఫోన్ ధ్వంసమా?

కపటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో కలకలం

తల్లిదండ్రి, ప్రధానోపాధ్యాయుడి మధ్య వాగ్వాదం

విచారణ చేపట్టాలని విద్యాశాఖ అధికారులకు డిమాండ్



**ఆదోని, జూన్ 22 (కొత్త స్వరం) :**

విద్యార్థులతో పాఠశాలలో చిన్నచిన్న పనులు చేయిస్తున్నారనే ఆరోపణల మధ్య ఆదోని మండలం కపటి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మరో వివాదం వెలుగులోకి వచ్చింది. తమ పిల్లలతో తరచూ పాఠశాల పనులు చేయిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేస్తూ ఓ విద్యార్థి తండ్రి పాఠశాలకు వెళ్లి ప్రధానోపాధ్యాయుడిని ప్రశ్నించగా, జరిగిన వాగ్వాదంలో ఆయన మొబైల్ ఫోన్ ధ్వంసమైనట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. బాధిత తండ్రి తెలిపిన వివరాల ప్రకారం, విద్యార్థులను చదువులకు బదులుగా వివిధ పనులకు వినియోగిస్తున్నారనే ఫిర్యాదుల నేపథ్యంలో విషయాన్ని తెలుసుకునేందుకు పాఠశాలకు వెళ్లినట్లు చెప్పారు. అయితే సమస్యను పరిష్కరించాల్సిన స్థానంలో ప్రధానోపాధ్యాయుడు ఆగ్రహం వ్యక్తం చేసి తన మొబైల్ ఫోన్‌ను పగులగొట్టారని ఆరోపించారు. ఈ ఘటన స్థానికంగా చర్చనీయాంశంగా మారింది. విద్యార్థుల హక్కులను కాపాడాల్సిన విద్యాసంస్థల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకోవడం ఆందోళన కలిగిస్తోందని తల్లిదండ్రులు పేర్కొన్నారు. విద్యార్థులతో పనులు చేయించారనే ఆరోపణలతో పాటు, ప్రశ్నించిన తల్లిదండ్రుల పట్ల అనుచితంగా ప్రవర్తించారనే ఆరోపణలు పాఠశాల పరిపాలనపై అనుమానాలకు తావిస్తున్నాయని వారు అభిప్రాయపడ్డారు. ఘటనపై సమగ్ర విచారణ జరిపి వాస్తవాలను వెలుగులోకి తీసుకురావాలని, ఆరోపణలు నిజమైతే బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని తల్లిదండ్రులు విద్యాశాఖ అధికారులను కోరుతున్నారు.

## ముఖ్యమంత్రి పర్యటన ఏర్పాట్లను పరిశీలించిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీ

ఈ నెల 24న జొన్నగిరి గనుల కేంద్రానికి ముఖ్యమంత్రి పర్యటన

ఏర్పాట్లపై అధికారులకు పలు సూచనలు

భద్రతా చర్యలు పకడ్బందీగా చేపట్టాలని ఆదేశం

రాకపోకలు, పార్కింగ్, వైద్య సదుపాయాల పరిశీలన

సమన్వయంతో పని చేసి పర్యటన విజయవంతం చేయాలని సూచన





**కర్నూలు, జూన్ 22 (కొత్త స్వరం) :**

ఈ నెల 24వ తేదీన రాష్ట్ర ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు పత్తికొండ నియోజకవర్గంలోని జొన్నగిరిలో ఉన్న బంగారు గనుల శుద్ధి కేంద్రాన్ని సందర్శించనున్న నేపథ్యంలో జిల్లా కలెక్టర్ డాక్టర్ ఏ. సిరి, జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ సోమవారం అక్కడ చేపడుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. ముఖ్యమంత్రి పర్యటన సజావుగా జరిగేలా చేపట్టాల్సిన ఏర్పాట్లపై సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమ వేదిక, రాకపోకల మార్గాలు, వాహనాల నిలిపివేత ప్రదేశాలు, భద్రతా ఏర్పాట్లు, తాగునీటి సదుపాయం, వైద్య సేవలు తదితర అంశాలను క్షుణ్ణంగా పరిశీలించారు. అధికారులందరూ పరస్పర సమన్వయంతో పనిచేసి ముఖ్యమంత్రి పర్యటనను విజయవంతం చేయాలని జిల్లా కలెక్టర్ సూచించారు. ప్రజలకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు ముందుగానే పూర్తి చేయాలని ఆదేశించారు. భద్రతా పరంగా ఎలాంటి లోపాలు తలెత్తకుండా పకడ్బందీ చర్యలు చేపట్టాలని జిల్లా ఎస్పీ సంబంధిత పోలీసు అధికారులను ఆదేశించారు.

# ప్రజా ఫిర్యాదులపై విచారణ జరిపి చట్టపరంగా న్యాయం చేస్తాం

**కర్నూలు ఉప పోలీసు అధికారి రాఘవేంద్ర**

**ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికకు 121 వినతులు**

**ఉద్యోగాల పేరుతో మోసాలపై అధిక ఫిర్యాదులు**

**భూ ఆక్రమణ, మోసాలపై బాధితుల ఆవేదన**

**ప్రతి ఫిర్యాదుపై చట్టప్రకారం విచారణకు హామీ**

**త్వరితగతిన సమస్యల పరిష్కారమే లక్ష్యమని స్పష్టం**

**కర్నూలు, జూన్ 22 (కొత్త స్వరం):**

జిల్లాలోని ప్రజల సమస్యలను నేరుగా తెలుసుకుని పరిష్కరించేందుకు నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చిన ప్రతి ఫిర్యాదుపై సమగ్ర విచారణ జరిపి, చట్టపరంగా బాధితులకు న్యాయం చేస్తామని కర్నూలు ఉప పోలీసు అధికారి శ్రీ రాఘవేంద్ర తెలిపారు. కర్నూలు కొత్తపేటలోని రెండు పట్టణ పోలీసు స్టేషన్ సమీపంలోని జిల్లా పోలీసు అధికారి శిబిర కార్యాలయంలో, జిల్లా పోలీసు అధికారి శ్రీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు సోమవారం ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని పలు ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించి, ఫిర్యాదుదారులతో నేరుగా మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. ఈ కార్యక్రమానికి మొత్తం 121 ఫిర్యాదులు అందాయి. వాటిలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి డబ్బులు తీసుకుని మోసం చేసిన ఘటనలు, భూ ఆక్రమణ వివాదాలు, గృహ నిర్మాణ మోసాలకు సంబంధించిన ఫిర్యాదులు అధికంగా నమోదయ్యాయి. కర్నూలు శ్రీరామ్ నగర్‌కు చెందిన సుప్రియ, ప్రభుత్వ ఆసుపత్రిలో ఉద్యోగం ఇప్పిస్తానని చెప్పి రూ. 5 లక్షల 50 వేల రూపాయలు తీసుకుని మోసం చేశారని ఎర్రవల్లి వేణుపై ఫిర్యాదు చేశారు. దేవనకొండ మండలం తెర్నేకల్లు గ్రామానికి చెందిన గిడ్డమ్మ, తన పొలాన్ని ఆక్రమించుకునేందుకు దాడి చేసి గాయపరిచారని బాధితులపై చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే, రైల్వే శాఖలో ఉద్యోగాలు ఇప్పిస్తామని చెప్పి 10 మందిని మోసం చేశారని కల్లూరుకు చెందిన గోవిందు ఫిర్యాదు చేశారు. స్వామిరెడ్డి నగర్‌కు చెందిన రామేశ్వరమ్మ, ఇల్లు నిర్మించి ఇస్తానని చెప్పి రూ. 8 లక్షలు తీసుకుని పని పూర్తి చేయలేదని మహబూబ్‌పై ఆరోపించారు. గూడూరు మండలం నాగాలాపురానికి చెందిన మద్దిలేటి, ప్రభుత్వ ఆసుపత్రిలో పర్యవేక్షకురాలి ఉద్యోగం ఇప్పిస్తామని చెప్పి రూ. 1 లక్ష 60 వేల రూపాయలు తీసుకుని మోసం చేసిన మహిళపై చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఉప పోలీసు అధికారి రాఘవేంద్ర మాట్లాడుతూ, ప్రజల నుంచి వచ్చిన ప్రతి ఫిర్యాదును చట్ట ప్రకారం పరిశీలించి, త్వరితగతిన పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో వలయ పరిశీలకులు శివశంకర్, పార్థసారథి, రామకృష్ణ, ప్రవీణ్ కుమార్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.




**పాత్రికేయులు కావలెను**

కొత్తస్వరం దినపత్రికకు అనుభవం కలిగిన, వార్తా కథనాలు (స్టోరీలు) రాయగలిగే పాత్రికేయ మిత్రులు కావలెను.

నంద్యాల జిల్లా నందికొట్కూరు నియోజకవర్గ పరిధిలోని ప్రాంతాలకు రిపోర్టర్లు అవసరం

నందికొట్కూరు - నందికొట్కూరు రూరల్ - పగిడ్యాల - జూపాడుబంగ్లా - కొత్తపల్లె - పాములపాడు - మిడుతూరు

కొత్త స్వరం 9492813364

# కొత్తస్వరం

తెలుగు దిన పత్రిక

## కర్నూలు - నంద్యాల

మంగళవారం, జూన్ 23, 2026




## 89వ రోజుకు చేరిన శ్రీశైలం ముంపు బాధితుల నిరవధిక దీక్షలు

**ఉద్యోగ హామీలు నెరవేర్చాలని బాధితుల డిమాండ్**

**నాయకులు ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలని ఆవేదన**

**కన్నీరు తుడిచే నాయకులు లేరంటూ నిర్వాసితుల వాపోయింపు**

**నందికొట్కూరు, జూన్ 22 (కొత్త స్వరం) :**

శ్రీశైలం ప్రాజెక్టు ముంపు బాధితుల నిరవధిక దీక్షలు 89వ రోజుకు చేరుకున్నాయి. రాష్ట్రంలో 8 లక్షల హెక్టార్ల భూమికి సాగునీరు, కోట్లాది మందికి తాగునీరు అందిస్తున్న శ్రీశైలం ప్రాజెక్టు వెనుక ముంపు బాధితుల కన్నీళ్లు దాగి ఉన్నాయని నిర్వాసితులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా నిర్వాసితుడు జయన్న మాట్లాడుతూ, తమ దీక్షలు 89 రోజులు కొనసాగుతున్నప్పటికీ తమ కన్నీరు తుడిచే నాయకులు ఎవరూ ముందుకు రాలేదని వాపోయారు. రాష్ట్రాన్ని అగ్రస్థానంలో నిలబెడతామని చెప్పే నాయకులు శ్రీశైలం ముంపు బాధితుల సమస్యలను ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. రాష్ట్రంపై పెద్దగా ఆర్థిక భారం లేకుండా చిన్నపాటి ఉద్యోగాలు ఇవ్వడానికి కూడా ప్రభుత్వం ముందుకు రాకపోవడం అమానవీయమని బాధితులు ఆందోళన వ్యక్తం చేశారు. లక్షలాది ఉద్యోగాలు ఇస్తామని ఇచ్చిన హామీలు ఇప్పటికీ నెరవేరకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. అలాగే కూటమిలోని నాయకులు ఇచ్చిన హామీలను గుర్తుచేస్తూ, వాటిని నెరవేర్చే వరకు పోరాటం ఆపబోమని హెచ్చరించారు. 32 మంది ఆత్మహత్యలకు పాల్పడినా స్పందన లేకపోవడం మరింత బాధ కలిగిస్తోందని తెలిపారు. ఈ దీక్షలో మౌలాలి, నారాయణ, నాగసుంకన్న, నాగేంద్ర, నాగరాజు, పవన్, వెంకటేశ్వర్లు, రామకృష్ణ, సుబ్బయ్య, జయన్న తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు ఇంటి స్థలాలు కేటాయించాలి: జాప్ వినతి

**సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించిన జాప్ సభ్యులు**

**పాత్రికేయుల సంక్షేమంపై ప్రభుత్వం దృష్టి సారించాలి**

**అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలాల మంజూరు కోరింపు**

**ప్రత్యేక సంక్షేమ విధానాలు రూపొందించాలని డిమాండ్**

**ప్రజాసేవలో జర్నలిస్టుల పాత్ర అమూల్యం**



**ఆదోని, జూన్ 22 (కొత్త స్వరం) :**

అర్హులైన జర్నలిస్టులకు ప్రభుత్వం ఇంటి స్థలాలు కేటాయించాలని కోరుతూ జర్నలిస్టు సంఘం ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాఖ ఆదోని యూనిట్ సభ్యులు సోమవారం సబ్ కలెక్టర్‌కు వినతిపత్రం సమర్పించారు. కర్నూలు జిల్లా అధ్యక్షుడు సునీల్ ఆదేశాల మేరకు ఈ వినతిపత్రాన్ని అందజేసినట్లు వారు తెలిపారు. ప్రజలకు, ప్రజాప్రతినిధులకు మధ్య వారధిగా వ్యవహరిస్తూ సమాజాభివృద్ధిలో కీలక పాత్ర పోషిస్తున్న జర్నలిస్టుల సంక్షేమంపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించాలని కోరారు. కూటమి ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తున్నప్పటికీ, జర్నలిస్టులకు ఇంటి స్థలాల కేటాయింపు విషయంలో ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించలేదని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను వెలుగులోకి తీసుకువస్తూ నిరంతరం సేవలందిస్తున్న పాత్రికేయుల జీవన భద్రత కోసం ఇంటి స్థలాల కేటాయింపును ప్రాధాన్యతగా తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. జర్నలిస్టుల సంక్షేమం కోసం ప్రత్యేక విధానాలు రూపొందించి, అర్హులైన వారికి ఇంటి స్థలాలు మంజూరు చేసేలా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జాప్ ఆదోని అధ్యక్షుడు కన్నా రాజశేఖర్, ఉపాధ్యక్షుడు మహేష్, కార్యదర్శి బెస్త గోవిందరాజులు, నిర్వాహకుడు శంకర్‌తో పాటు పలువురు సభ్యులు పాల్గొన్నారు.

## ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత

రాయపాటి మురళీమోహన్

అర్హులైన వారంతా ఓటరుగా నమోదు కావాలి

ఇంటింటికీ వెళ్లి ఓటుపై అవగాహన

ఓటరు జాబితాలో వివరాలు పరిశీలించుకోవాలని సూచన

ప్రజాస్వామ్య బలోపేతానికి ఓటర్ల సహకారం అవసరం

ప్రత్యేక సవరణ కార్యక్రమంలో బీజేపీ నాయకుల భాగస్వామ్యం




**పాములపాడు, జూన్ 22 (కొత్త స్వరం) :**

ఓటు హక్కు ప్రతి పౌరుడి బాధ్యత అని, అర్హత కలిగిన ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా ఓటరుగా నమోదు కావాలని భారతీయ జనతా పార్టీ మండల అధ్యక్షుడు రాయపాటి మురళీమోహన్ అన్నారు. ఎన్నికల సంఘం చేపట్టిన ప్రత్యేక ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో భాగంగా మండల కేంద్రం పాములపాడులోని పోలింగ్ కేంద్రం సంఖ్య 207 వద్ద ప్రభుత్వ బూత్ స్థాయి అధికారి బసూర్ బీతో కలిసి ఇంటింటికీ తిరుగుతూ ఓటుపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఓటర్లను చైతన్యపరిచే కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రాయపాటి మురళీమోహన్ మాట్లాడుతూ, అర్హత కలిగిన ప్రతి పౌరుడు ఓటరుగా నమోదు కావాలని, ఓటరు జాబితాలో తమ వివరాలు సక్రమంగా ఉన్నాయో లేదో తప్పనిసరిగా పరిశీలించుకోవాలని సూచించారు. అలాగే ఓటర్లందరూ ఎన్నికల ప్రక్రియలో చురుకుగా పాల్గొని ప్రజాస్వామ్య బలోపేతానికి సహకరించాలని పిలుపునిచ్చారు. ఓటు హక్కును వినియోగించడం ప్రతి పౌరుడి బాధ్యత అని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ నాయకుడు దామోదర్ రెడ్డి, భారతీయ జనతా పార్టీ ప్రధాన కార్యదర్శి గోపాలకృష్ణయ్య, ప్రవీణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కంప్యూటర్ నిర్వాహకులకు డబ్బులు ఇవ్వాల్సిందేనా..?



**ధృవపత్రాలకు డబ్బులే దారిగా మారిందా?**

**తహసీల్దార్ కార్యాలయంపై డివైఎఫ్ఐ తీవ్ర ఆరోపణలు**

**సబ్ కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పణ**

**అవినీతిపై సమగ్ర విచారణ చేయాలని డిమాండ్**

**ప్రజలకు ఉచితంగా సేవలు అందించాలని విజ్ఞప్తి**

**ఆదోని, జూన్ 22 (కొత్త స్వరం) :**

తహసీల్దార్ కార్యాలయంలో బియ్యం కార్డు, కుటుంబ సభ్యుల ధృవపత్రం తదితర పత్రాలకు అంకెల ఆధారిత ఆమోదం పొందేందుకు ప్రజలు కంప్యూటర్ నిర్వాహకులకు డబ్బులు చెల్లించాల్సిన పరిస్థితి నెలకొన్నదని డివైఎఫ్ఐ పట్టణ కార్యదర్శి వెంకటేష్, ఉపాధ్యక్షుడు నాగరాజు ఆరోపించారు. ఈ సమస్యపై సోమవారం సబ్ కలెక్టర్ కార్యాలయంలో పరిపాలన అధికారికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, తహసీల్దార్ కార్యాలయంలో ఏ చిన్న ధృవపత్రం పొందాలన్నా కంప్యూటర్ నిర్వాహకులకు డబ్బులు ఇవ్వాల్సి వస్తోందని, దీనివల్ల సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రభుత్వ సేవలు పారదర్శకంగా, అవినీతి రహితంగా ప్రజలకు అందాల్సి ఉండగా, కొందరి నిర్లక్ష్యం మరియు అవినీతి కారణంగా ప్రజలు నష్టపోతున్నారని విమర్శించారు. ముఖ్యంగా పేద, మధ్యతరగతి కుటుంబాలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరుగుతూ అదనపు ఆర్థిక భారం మోయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత ఉన్నతాధికారులు ఈ వ్యవహారంపై వెంటనే దృష్టి సారించి సమగ్ర విచారణ చేపట్టి, అవినీతికి పాల్పడుతున్న వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అలాగే ప్రజలకు ఎలాంటి అదనపు చెల్లింపులు లేకుండా ప్రభుత్వ సేవలు అందేలా తక్షణ చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డివైఎఫ్ఐ నాయకుడు చిన్నతో పాటు పలువురు కార్యకర్తలు పాల్గొన్నారు.

## సిద్ధాపురం చెరువు కాలువ పనులు వెంటనే పూర్తి చేయాలి

**జనసేన నాయకుల డిమాండ్**

**ఐదు గ్రామాలకు సాగునీరు అందించాలంటూ ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**నాలుగు కిలోమీటర్ల కాలువ పూర్తి కాక రైతులకు ఇబ్బందులు**

**పది వేల ఎకరాలకు నీరు అందే అవకాశం**

**రైతుల సమస్యలు పరిష్కరించాలని ప్రజాప్రతినిధులకు వినతి**

**కాలువ పూర్తి చేస్తే పొలాలు సస్యశ్యామలం అవుతాయని ఆశాభావం**

**పాములపాడు, జూన్ 22 (కొత్త స్వరం) :**

ఆత్మకూరు మండలంలోని సిద్ధాపురం చెరువు నుంచి కరివేన, నల్లకాలువ, కొత్త రామాపురం మీదుగా పాములపాడు మండలంలోని భానుముక్కల, ఎర్రగూడూరు గ్రామాల వరకు వెళ్లే కాలువ పనులను త్వరగా పూర్తి చేసి పొలాలకు సాగునీరు అందించాలని జనసేన పార్టీ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. భానుముక్కల గ్రామానికి చెందిన జనసేన నాయకులు షేక్ ఉస్మాన్ భాష, దస్తగిరి ఆధ్వర్యంలో కాలువ పనుల పరిశీలన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి నందికొట్కూరు నియోజకవర్గ జనసేన సమన్వయ బాధ్యులు నల్లమల రవికుమార్, గంగాధర్ యాదవ్, బత్తుల కిరణ్ రాజ్, మాసుమ్ భాషతో పాటు భానుముక్కల గ్రామ రైతులు భారీ సంఖ్యలో హాజరై తమ సమస్యలను వెల్లడించారు. వెలుగోడు జలాశయం నుంచి సిద్ధాపురం చెరువుకు నీరు చేరి, అక్కడి నుంచి కరివేన, నల్లకాలువ, కొత్త రామాపురం, భానుముక్కల, ఎర్రగూడూరు గ్రామాల మీదుగా ప్రవహించి తెలుగు గంగలో కలిసే విధంగా ఈ ప్రణాళిక రూపొందించారని నాయకులు తెలిపారు. అయితే సిద్ధాపురం చెరువు నుంచి భానుముక్కల గ్రామం వరకు మాత్రమే కాలువ తవ్వి, ఆ తర్వాత పనులను నిలిపివేశారని ఆవేదన వ్యక్తం చేశారు. అక్కడి నుంచి కేవలం నాలుగు కిలోమీటర్ల మేర కాలువ పనులు పూర్తి చేస్తే తెలుగు గంగకు అనుసంధానం సాధ్యమవుతుందని చెప్పారు. ఆ పనులు పూర్తికాకపోవడంతో సంబంధిత గ్రామాలకు సాగునీరు అందడం లేదన్నారు. ఏళ్ల తరబడి ఈ ప్రాంత రైతులు నీటి కోసం ఎదురుచూస్తున్నారని, కాలువ పనులు పూర్తయితే ఐదు గ్రామాల్లో దాదాపు పది వేల ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. దీంతో రైతుల పొలాలు సస్యశ్యామలంగా మారి వ్యవసాయం అభివృద్ధి చెందుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఈ సమస్యను అత్యవసరంగా పరిష్కరించాలని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్త జయసూర్య, జిల్లా పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ బైరెడ్డి శబరమ్మ, నీటిపారుదల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, ముఖ్యమంత్రి ఎన్. చంద్రబాబు నాయుడు లకు రైతులు, జనసేన నాయకులు విజ్ఞప్తి చేశారు.








## గ్రేడ్-3 ఏఎన్ఎంలకు తక్షణమే పదోన్నతులు కల్పించాలి

**ఆరోగ్య కార్యదర్శులపై పని భారం తగ్గించాలని డిమాండ్**

**43 మొబైల్ అనువర్తనాల భారం వల్ల తీవ్ర ఒత్తిడి**

**జీవో 179 అమలు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తి**

**ఖాళీ ఏఎన్ఎం ఉద్యోగాలను భర్తీ చేయాలని కోరింపు**

**అధికారులకు వినతిపత్రం అందజేసిన సంఘ నాయకులు**




**జూపాడుబంగ్లా, జూన్ 22 (కొత్త స్వరం) :**

రాష్ట్రవ్యాప్తంగా గ్రామ, వార్డు సచివాలయాల్లో పనిచేస్తున్న ఆరోగ్య కార్యదర్శులు, ఏఎన్ఎంలపై పెరుగుతున్న పని ఒత్తిడిని ప్రభుత్వం తక్షణమే తగ్గించాలని, జీఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన గ్రేడ్-3 ఏఎన్ఎంలకు వెంటనే పదోన్నతులు కల్పించాలని ఎపి సచివాలయ ఆరోగ్య కార్యదర్శుల సంఘం, ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఎం. రమేష్ బాబు కోరారు. సోమవారం జూపాడుబంగ్లా మండలంలోని ప్రజా ఫిర్యాదు పరిష్కార వ్యవస్థలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 2019లో నియమితులైన ఆరోగ్య కార్యదర్శులు సచివాలయ వ్యవస్థతో పాటు వైద్య ఆరోగ్య శాఖ అధికారుల ఆదేశాల మధ్య తీవ్ర పని ఒత్తిడిని ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రజారోగ్య సేవలు అందించాల్సిన ఉద్యోగులతో ఇంటింటి సర్వేలు, ఓటరు జాబితాల తయారీ, ఇతర శాఖలకు సంబంధించిన పనులు చేయించడం వల్ల వారి అసలు విధులకు ఆటంకం కలుగుతోందన్నారు. సుమారు 43 మొబైల్ అనువర్తనాల్లో వివిధ రకాల సమాచారాన్ని నమోదు చేయాల్సి రావడం వల్ల క్షేత్రస్థాయిలో వైద్య సేవలపై ప్రతికూల ప్రభావం పడుతోందని, ఉద్యోగులు తీవ్ర మానసిక ఒత్తిడికి గురవుతున్నారని పేర్కొన్నారు. ఆరోగ్య కార్యదర్శులపై ఉన్న అనువర్తనాల భారాన్ని తగ్గించడంతో పాటు వారి విధులు, బాధ్యతలపై స్పష్టతనిస్తూ ప్రత్యేక విధి చిట్టా రూపొందించాలని ప్రభుత్వాన్ని కోరారు. అలాగే సచివాలయాల్లో గ్రేడ్-3 ఏఎన్ఎంలుగా పనిచేస్తూ రెండేళ్లపాటు జీఎన్ఎం శిక్షణ పూర్తిచేసిన ఉద్యోగులకు గతంలో ఇచ్చిన హామీల మేరకు పదోన్నతులు కల్పించాలని డిమాండ్ చేశారు. ప్రస్తుతం జరుగుతున్న సలహా ప్రక్రియలో అర్హులను పరిగణనలోకి తీసుకోకపోవడం అన్యాయమని అన్నారు. జీవో ఎంఎస్ నంబరు 179ను అమలు చేసి అర్హులైన గ్రేడ్-3 ఏఎన్ఎంలందరికీ గ్రేడ్-2 కింద పదోన్నతులు కల్పించాలని కోరారు. ముఖచిత్ర గుర్తింపు అనువర్తనం, వేలిముద్ర హాజరు విధానాల వల్ల ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని చేతివ్రాత హాజరు పట్టికలను కూడా అందుబాటులో ఉంచాలని సూచించారు. సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్ఎంలందరినీ వైద్య ఆరోగ్య శాఖ పరిధిలోకి తీసుకువచ్చి ప్రత్యేక పర్యవేక్షణ వ్యవస్థ ఏర్పాటు చేయాలని, రాష్ట్రవ్యాప్తంగా ఖాళీగా ఉన్న ఏఎన్ఎం ఉద్యోగాలను కొత్త నియామకాల ద్వారా భర్తీ చేయాలని ప్రభుత్వాన్ని కోరారు.

## కరివేన గ్రామంలో ఘనంగా రైతన్న మీకోసం వారోత్సవాలు

**ఖరీఫ్‌లో అనుకూల పంటల సాగుపై అధికారుల సూచనలు**

**ఎరువుల పంపిణీ విధానంపై రైతులకు అవగాహన**

**ఉద్యాన పథకాల వివరాలు వెల్లడించిన అధికారులు**

**ఆత్మకూరు, జూన్ 22 (కొత్త స్వరం) :**

రైతన్న మీకోసం వారోత్సవాల సందర్భంగా ఆత్మకూరు మండలంలోని కరివేన గ్రామాన్ని మండల వ్యవసాయ అధికారిణి హేమలత, ఉద్యాన శాఖ అధికారిణి కె. చందన సందర్శించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారిణి హేమలత మాట్లాడుతూ, ఖరీఫ్ సీజన్‌లో వర్షాభావ పరిస్థితుల ప్రభావం పంటలపై ఉండే అవకాశం ఉన్నందున రైతులు ఎండ పరిస్థితులను తట్టుకునే పంటలతో పాటు పప్పుధాన్యాల సాగుపై దృష్టి పెట్టాలని సూచించారు. అలాగే యూరియా, డీఏపీ ఎరువుల పంపిణీకి ఉపయోగిస్తున్న ఏపీఏఐఎంఎస్ యాప్ విధానం, దాని ప్రాధాన్యత గురించి రైతులకు వివరించారు. ఉద్యాన శాఖ అధికారిణి కె. చందన మాట్లాడుతూ, ఉద్యానవన శాఖ ద్వారా అమలవుతున్న వివిధ పథకాల వివరాలను రైతులకు తెలియజేశారు. ఈ పథకాలను సద్వినియోగం చేసుకుని రైతులు అధిక ఆదాయం పొందాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల పరిషత్ అభివృద్ధి అధికారి నాగేంద్రుడు, వ్యవసాయ విస్తరణ అధికారి సతీష్ బాబు, గ్రామ వ్యవసాయ సహాయకుడు అశోక్ కుమార్‌తో పాటు రైతులు పాల్గొన్నారు.



Edited, Printed, Published by **KEDEM RAVI RAJU,** Printed at 3-151, DAMAGATLA NANDIKOTKURU, KURNOOL, ANDHRA PRADESH - 518432, **VSAR PUBLICATIONS,** 91/4-31-3-1B, BALAJINAGAR, KURNOOL, ANDHRA PRADESH - 518006, A.P., Editor : **KEDEM RAVI RAJU**, Cell No. 9912213364, Email:kothaswaram2024@gmail.com, **PRGI No. APTEL/2010/31893**, WebSite : www.kothaswaram.com

కొత్తస్వరం
తెలుగు దిన పత్రిక
https://kothaswaram.com

మంగళవారం
జూన్ 23, 2026

# చిత్తూరు జిల్లాలో విషాదం..

## ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి

### కుటుంబ కలహాలు, ఆర్థిక ఇబ్బందులే కారణమా?

### ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించిన పోలీసులు

**చిత్తూరు, జూన్ 22 (కొత్త స్వరం):**
చిత్తూరు జిల్లాలో హృదయ విదారక ఘటన చోటుచేసుకుంది. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు మృతి చెందిన ఘటన స్థానికంగా తీవ్ర విషాదాన్ని నింపింది. ఈ ఘటన దిగువసపల్లె పంచాయతీ పరిధిలోని బంగారెడ్డిపల్లిలో జరిగింది. పోలీసుల ప్రాథమిక సమాచారం ప్రకారం, దామోదరం (30), అతని భార్య నిర్మల (25), కుమారుడు రాజేష్, కుమార్తె శ్రీవిద్య మృతిచెందారు. భార్య అనారోగ్యం, కుటుంబ ఆర్థిక ఇబ్బందులు ఈ ఘటనకు కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. నిర్మల కొంతకాలంగా తీవ్రమైన అనారోగ్యంతో చికిత్స పొందుతున్నట్లు సమాచారం. ఆమె ఆరోగ్య పరిస్థితి మెరుగుపడకపోవడం, కుటుంబ ఆర్థిక పరిస్థితి కూడా బలహీనంగా ఉండటంతో దామోదరం తీవ్ర మనస్తాపానికి గురైనట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న బీఎన్ఆర్ పేట పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనకు సంబంధించిన అన్ని కోణాల్లో విచారణ కొనసాగుతోంది. ఈ సంఘటనతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. కుటుంబ సభ్యులు, బంధువులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు.

# జనసేన బలోపేతం లక్ష్యంగా కీలక నిర్ణయం

## సమాచార సేకరణకు పరిశీలకుల నియామకం

**అమరావతి, జూన్ 22 (కొత్తస్వరం) :**
జనసేన పార్టీ సంస్థాగత నిర్మాణాన్ని మరింత బలోపేతం చేసే దిశగా పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ పదవుల కోసం దరఖాస్తుల స్వీకరణ, నాయకుల అభిప్రాయాల సేకరణ కోసం 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు సమాచార సేకరణ కమిటీ పరిశీలకులను నియమించారు. పార్టీ అభివృద్ధి కోసం కృషి చేసిన నాయకులు, జనసైనికులు, వీర మహిళల నుంచి దరఖాస్తులను స్వీకరించేందుకు ఈ కమిటీలు పనిచేయనున్నాయి. పార్టీలో ఏ స్థాయి బాధ్యతలు చేపట్టాలనుకుంటున్నారో దరఖాస్తుదారుల అభిప్రాయాలను కూడా సేకరించనున్నాయి. ప్రతి పరిశీలకుడికి ముగ్గురు సీనియర్ నాయకులు, ముగ్గురు సాధకులు, 21 మంది సమన్వయకర్తలు సహకరించనున్నారు. సేకరించిన దరఖాస్తులను పార్టీ కేంద్ర కార్యాలయానికి పంపించనుండగా, వాటిని పార్టీ అధ్యక్షుడు పవన్ కల్యాణ్ స్వయంగా పరిశీలించనున్నారు. తుది నిర్ణయం పార్టీ అధ్యక్షుడిదేనని జనసేన స్పష్టం చేసింది. ఈ నెల 29వ తేదీ నుంచి సమాచార సేకరణ ప్రక్రియ ప్రారంభం కానుంది. పార్లమెంట్ నియోజకవర్గాల వారీగా ప్రత్యేక సమావేశాలు నిర్వహించి దరఖాస్తులను స్వీకరించనున్నారు. పార్టీ నిర్మాణాన్ని క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం చేయడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని పార్టీ వర్గాలు వెల్లడించాయి. ఇప్పటికే శ్రీకాకుళం నుంచి అనంతపురం వరకు ఉన్న 25 పార్లమెంట్ నియోజకవర్గాలకు సీనియర్ నేతలను పరిశీలకులుగా నియమించారు. వీరు స్థానిక స్థాయిలో పార్టీ కార్యకర్తల అభిప్రాయాలను సేకరించి కేంద్ర నాయకత్వానికి నివేదిక సమర్పించనున్నారు. ఈ నియామకాలతో పార్టీ క్షేత్ర స్థాయిలో మరింత బలోపేతం అవుతుందని జనసేన వర్గాలు భావిస్తున్నాయి.

# నేడు ఏపి కేబినేట్ భేటీ


## కీలక నిర్ణయాలపై చర్చించే అవకాశం

**అమరావతి, జూన్ 22 (కొత్తస్వరం) :**
సచివాలయంలో ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళశారం ఉదయం 10.30 గంటలకు రాష్ట్ర మంత్రివర్గ సమావేశం జరగనుంది. ఈ సమావేశంలో రాష్ట్ర అభివృద్ధికి సంబంధించిన పలు కీలక అంశాలపై నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. స్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ప్రమోషన్ బోర్డు ఇప్పటికే ఆమోదించిన పెట్టుబడి ప్రతిపాదనలకు కేబినెట్ గ్రీన్ సిగ్నల్ ఇవ్వనుంది. మొత్తం రూ.30,515 కోట్ల పెట్టుబడులకు ఆమోదం లభించే అవకాశం ఉండగా, వీటి ద్వారా రాష్ట్రంలో 29,677 మందికి ఉపాధి అవకాశాలు కలగనున్నాయి. అమరావతిలో ప్రతిష్ఠాత్మకంగా అభివృద్ధి చేస్తున్న క్వాంటం వ్యాలీ ప్రాజెక్టులో భాగంగా 10 సంస్థల ఏర్పాటుకు కూడా ఏపీ కేబినెట్ ఆమోదం తెలిపే అవకాశం ఉంది. ఈ నిర్ణయం రాష్ట్రంలో సాంకేతిక, పారిశ్రామిక రంగాల అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది. అలాగే ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న 'తల్లికి వందనం' పథకానికి సంబంధించిన నిధుల విడుదలపై కూడా మంత్రివర్గం నిర్ణయం తీసుకునే అవకాశముంది. ఇక, కేబినెట్ అజెండా ముగిసిన అనంతరం కూటమి ప్రభుత్వ రెండేళ్ల పాలనపై సమీక్ష నిర్వహించే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఈ సందర్భంగా రెండేళ్ల పాలనలో సాధించిన విజయాలు, అమలు చేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజలకు సమగ్రంగా వివరించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు మంత్రులకు దిశానిర్దేశర చేయనున్నట్లు తెలుస్తోంది.

# మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం

## ఆరుగురు ఉద్ధవ్ ఎంపిలు శిందే వర్గంలో చేరిక

**ముంబయి, జూన్ 22 (కొత్తస్వరం) :**
మహారాష్ట్రలో కీలక రాజకీయ పరిణామం చోటుచేసుకుంది. శివసేన (యూబీటీ)కు చెందిన ఆరుగురు ఎంపీలు శిందే నేతృత్వంలోని శివసేనలో చేరారు. దీంతో గడిచిన కొన్ని రోజులుగా శివసేన (యూబీటీ)లో చీలికపై జరుగుతున్న ప్రచారానికి తెరపడింది. 'ఆరు పులులు (ఎంపీలనుద్దేశించి) ఇప్పుడు అసలైన శివసేన ఫ్యామిలీలోకి వచ్చాయి. వారికి స్వాగతం. ఆపరేషన్ టైగర్ విజయవంతమైంది' అని మహారాష్ట్ర డిప్యూటీ సీఎం ఏక్‌నాథ్ శిందే ప్రకటించారు. శిందే క్యాంప్‌లో చేరిన ఎంపీల్లో ఓం రాజే నింబాల్కర్, సంజయ్ దిన పాటిల్, సంజయ్ జాదవ్, సంజయ్ దేశ్‌ముఖ్, నగేష్ పాటిల్ అష్టికర్, బౌసాహెబ్ వక్చౌరే ఉన్నారు. మొత్తం 9 మంది ఎంపీల్లో ఆరుగురు శిందే క్యాంప్‌లో చేరడంతో పార్టీ ఫిరాయింపుల చట్టం వర్తించకుండా జాగ్రత్త పడినట్లు తెలుస్తోంది. నాలుగేళ్ల క్రితం 2022 జూన్ 22న 40 మంది ఎమ్మెల్యేలు తమతో వచ్చారన్న శిందే.. ఇప్పుడు ఏకంగా 'సిక్స' కొట్టామని పేర్కొన్నారు. శివసేన రెండో విడత విస్తరణ ప్రణాళికగా ఈ చేరికను అభివర్ణించారు. మాజీ సీఎం ఉద్ధవ్ ఠాక్రే ఇటీవల దిల్లీలో పార్లమెంటరీ పార్టీ సమావేశం ఏర్పాటు చేయగా.. కేవలం ముగ్గురు ఎంపీలు మాత్రమే హాజరయ్యారు. దీంతో శివసేనలో మరోసారి చీలిక ప్రచారం ఊపందుకుంది. ఈ క్రమంలోనే కొన్ని రోజులుగా అధికార, విపక్ష కూటముల మధ్య మాటల యుద్ధం కొనసాగుతున్న వేళ తాజాగా ఆరుగురు ఎంపీలు శిందే క్యాంప్‌లో ప్రత్యక్షమయ్యారు. నియోజకవర్గ అభివృద్ధికి నిధులు అందడం లేదన్న కారణంతోనే తాము పార్టీ మారుతున్నట్లు రెబల్ ఎంపీలు చెప్పుకొచ్చారు.



# ప్రమాదకరంగా వేలాడుతున్న విద్యుత్ వైర్లు..

**రైతుల ప్రాణాలకు ముప్పు**
**వ్యవసాయ పొలంలో తక్కువ ఎత్తులో విద్యుత్ తీగలు**
**రైతులు, కూలీలు, పశువులకు ప్రమాద హెచ్చరిక**
**వెంటనే చర్యలు తీసుకోవాలని రైతు విజ్ఞప్తి**

**బషీరాబాద్, జూన్ 22 (కొత్త స్వరం) :**
వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం మైల్వార్ గ్రామానికి చెందిన రైతు మాల చిన్న శామప్ప పొలంలో ప్రమాదకరంగా విద్యుత్ వైర్లు వేలాడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. గ్రామ పరిధిలోని సర్వే నంబర్ 254/అ/2లో ఉన్న తన వ్యవసాయ పొలంలో విద్యుత్ తీగలు చాలా తక్కువ ఎత్తులో ఉండటంతో రైతులు, వ్యవసాయ కూలీలు, పశువులకు ప్రాణాపాయం ఏర్పడుతోందని తెలిపారు. వ్యవసాయ పనుల సమయంలో అనుకోకుండా విద్యుత్ తీగలు తగిలితే తీవ్రమైన ప్రమాదాలు జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యను పలుమార్లు విద్యుత్ శాఖ సిబ్బంది, సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ ఇప్పటివరకు ఎలాంటి చర్యలు చేపట్టలేదని ఆరోపించారు. సమస్య తీవ్రతను అధికారులు గుర్తించి వెంటనే స్పందించాలని కోరారు. ప్రమాదం జరిగే ముందే తమ పొలంలో ఉన్న విద్యుత్ వైర్లను సరిచేసి భద్రత కల్పించాలని రైతు మాల చిన్న శామప్ప విజ్ఞప్తి చేశారు.

# డంపింగ్ యార్డు తొలగించాలని ప్రజాభవన్‌లో వినతి



**జూలై 1 నుంచి 20 వరకు పాదయాత్రలు, మండలాల వారీగా చర్చా సమావేశాలు**
**జవహర్‌నగర్ డంపింగ్ యార్డు ఎత్తివేత కోసం పోరాట కమిటీ తీర్మానం**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జవహర్‌నగర్, జూన్ 22 (కొత్త స్వరం):**
జవహర్‌నగర్‌లోని రాంకీ చెత్త డంపింగ్ యార్డును తక్షణమే తొలగించాలని డిమాండ్ చేస్తూ డంపింగ్ యార్డు ఎత్తివేత పోరాట కమిటీ ప్రజాభవన్‌లో వినతిపత్రం సమర్పించనుంది. ఈ విషయాన్ని కమిటీ చైర్మన్ షేక్ షావలి తెలిపారు. జ్యోతిరావు పూలే కార్యాలయంలో సోమవారం నిర్వహించిన సమావేశంలో షేక్ షావలి అధ్యక్షత వహించారు. జవహర్‌నగర్, కీసర పరిసర ప్రాంతాల ప్రజలు డంపింగ్ యార్డు కారణంగా తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని సమావేశంలో పేర్కొన్నారు. ముఖ్యంగా శామీర్‌పేట్, యాప్రాల్, కీసర, చీరాల, సాకేట్, రాంపల్లి, నాగారం, ఘట్‌కేసర్ ప్రాంతాల ప్రజలపై ఈ ప్రభావం తీవ్రంగా ఉందని తెలిపారు. ప్రజల సమస్యలను ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు జూన్ 23న ప్రజాభవన్‌లో వినతిపత్రం సమర్పించాలని నిర్ణయించారు. అలాగే ఉద్యమాన్ని మరింత బలోపేతం చేసే క్రమంలో జూలై 1 నుంచి జవహర్‌నగర్ డంపింగ్ యార్డు పరిసర మండలాల్లో చర్చా సమావేశాలు నిర్వహించనున్నారు. జూలై 10 నుంచి 20 వరకు జీహెచ్ఎంసీ పరిధిలోని సుమారు 100 బస్తీల్లో పాదయాత్రలు చేపట్టి ప్రజలను చైతన్యపరచాలని తీర్మానించారు. భవిష్యత్తులో ప్రజా పోరాట కార్యక్రమాలను మరింత విస్తరించేందుకు వివిధ సంస్థల నాయకుల సూచనల మేరకు పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. ఈ సమావేశంలో మాజీ కార్పొరేటర్లు గొడుగు వేణు, సుబ్రమణ్యం, శివబాబు, నర్సింహ గౌడ్, మీరా, యాకస్వామి, శంకర్, ప్రవీణ్, మల్లేష్, జయక్క, సునీత, చంద్రమౌళి, సురేష్, వెంకటయ్య, జయసుధ, స్వరూప, లక్ష్మీ, మహ్మద్ జావేద్, కాలేషా, అబ్బా, మొయిన్, మాధవరెడ్డి, మేడశీను, రేణుక తదితరులు పాల్గొన్నారు.

# భూమి గురించి అడిగితే ఎస్‌బిఐపై పగబట్టారు

**మహబూబ్‌నగర్, జూన్ (కొత్తస్వరం) :**
హైదరాబాద్‌లో స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాకు అప్పటి ప్రభుత్వం ఎకరం భూమిచ్చిందని, అయితే...రేవంత్ రెడ్డి బ్యాంక్‌కు ఇచ్చిన భూమిని అమ్మేసిండని మాజీ మంత్రి, డిప్యూటీ ఫ్లోర్ లీడర్ హరీశ్ రావు మండిపడ్డారు. అంతేగాకుండా ఇప్పుడు ఎస్‌బిఐ మీద పగపట్టిండని మండిపడ్డారు. అచ్చంపేట బీఆరఎస్ కార్యకర్తల సమావేశంలో హరీశ్ రావు మాట్లాడుతూ.. ఎస్‌బీఐకి ఇచ్చిన భూమిని వేలానికి ఇచ్చిండు.. భూమిని అమ్మేసిండు. అమ్మేస్తే స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కోర్టుకు వెళ్లింది. మాకు ఎకరం భూమి ఇచ్చిరు. ఇది కూడా ఉచితంగా ఏం ఇయ్యలేదు. మేము దాదాపు రూ.20 కోట్లు పెట్టి ఈ భూమి కొనుక్కున్నమని.. ఈ భూమి మా పొజిషన్‌లో ఉన్నది. పైసల్ పెట్టి కొన్న మా భూమి రేవంత్ రెడ్డి ఎట్లా అమ్ముకున్నడు.. అని హైకోర్టుకు పోయారన్నారు.కోర్టు వాళ్లు పైసలు పెట్టి కొన్నది నిజమే కదా ఈ అమ్మకం తప్పు అని స్టే ఇచ్చింది. ఖతం రేవంత్ రెడ్డి ఎస్‌బీఐ మీద పగపట్టిండు. ఎస్‌బీఐని నిషేధిస్తాం. ఎస్‌బీఐలో ఉండే ఫిక్సడ్ డిపాజిట్లు బయటకు తీసేస్తాం. ఎస్‌బీఐకి రాష్ట్ర ప్రభుత్వానికి ఉండే ఖాతాలన్ని తీసేస్తా.. అని స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాను కూడా బ్లాక్ మెయిల్ చేస్తుండు.. రేవంత్ రెడ్డి తీరు ఎవరన్నా ప్రశ్నిస్తే పగబడ్తమన్నట్టు ఉంది. ఇవాళ స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియానే నిషేధిస్తా అంటున్నడు.. రేపు రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, వరల్డ్ బ్యాంక్ కూడా నీ మాట వినలేదనుకో దాన్ని కూడా నిషేధిస్తా అంటాడు అని ఎద్దేవా చేశారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యకలాపాలు నిర్వహించేందుకు ఒక ఒక బ్యాంక్ అయితే కావాలి కదా.. ఎవరు నీకు వ్యతిరేకంగా మాట్లాడితే ఆ బ్యాంక్‌నే నిషేధిస్తా అంటే మరి ఏం చేస్తడు.. నాకో డౌటు..కొత్తగా కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెడ్తడో ఏమో.. పెట్టినా పెడ్తడు మస్త్ జమ అయినయ్ పైసలు. రేపు ఎనుముల కొండల్ రెడ్డి బ్యాంక్ అని పెట్టినా పెడ్తరన్నారు హరీశ్ రావు ఎద్దేవా చేశారు.





# ప్రజావాణి అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలి: అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్

**ప్రజావాణిలో 106 దరఖాస్తులు స్వీకరణ**
**జాప్యం లేకుండా అర్జీల పరిశీలనకు అధికారులకు ఆదేశాలు**

**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జూన్ 22 (కొత్త స్వరం ప్రతినిధి):**
ప్రజావాణిలో స్వీకరించిన అర్జీలను సంబంధిత శాఖల అధికారులు జాప్యం లేకుండా పరిశీలించి త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ అధికారులను ఆదేశించారు. సోమవారం మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన అర్జీదారుల నుంచి మొత్తం 106 దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో డిఆర్ఓ మాలతి, అదనపు కలెక్టర్ విజయేందర్ రెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ మాట్లాడుతూ, ప్రజలు ఎంతో వ్యయప్రయాసలకు ఓర్చుకొని తమ సమస్యలు పరిష్కారమవుతాయనే నమ్మకంతో అధికారుల వద్దకు వస్తారని తెలిపారు. వారి నమ్మకాన్ని నిలబెట్టడం ప్రతి అధికారిపైనా ఉన్న బాధ్యత అని అన్నారు. ప్రజావాణిలో వచ్చిన ప్రతి దరఖాస్తును వెంటనే పరిశీలించి పరిష్కార చర్యలు చేపట్టాలని, దరఖాస్తుల పరిశీలనలో ఎలాంటి ఆలస్యం జరగకుండా చూడాలని అధికారులకు సూచించారు. అలాగే తిరస్కరించాల్సిన దరఖాస్తుల విషయంలో, తిరస్కరణకు గల కారణాలను స్పష్టంగా అర్జీదారులకు వివరించాలని ఆదేశించారు. స్వీకరించిన దరఖాస్తులపై తీసుకున్న చర్యల వివరాలను ఆన్‌లైన్‌లో వెంటనే నమోదు చేయాలని సంబంధిత శాఖల అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# పలు ప్రాంతాల్లో నేడు విద్యుత్ నిలిపివేత

**నిర్వహణ పనుల కోసం విద్యుత్ సరఫరా నిలిపివేత**
**ఉదయం 10 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు అంతరాయం**




**మేడ్చల్ మల్కాజిగిరి జిల్లా, జూన్ 22 (కొత్త స్వరం ప్రతినిధి):**
షామీర్‌పేట్ మండలం తూముకుంట పరిధిలో నిర్వహణ పనుల కారణంగా పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ అధికారులు తెలిపారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చెట్ల కొమ్మల తొలగింపు, ఫీడర్ నిర్వహణ పనుల నిమిత్తం 33/11 కేవీ తూముకుంట సబ్‌స్టేషన్ నుంచి వెలువడే 11 కేవీ తూముకుంట మరియు గాయత్రి ఫీడర్లు పూర్తిగా నిలిపివేయనున్నట్లు వెల్లడించారు. ఇందుకోసం సంబంధిత అనుమతులు మంజూరయ్యాయి. జూన్ 23, 2026న ఉదయం 10:00 గంటల నుంచి సాయంత్రం 5:00 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయబడుతుంది. ప్రజలు ముందస్తుగా తగిన ఏర్పాట్లు చేసుకోవాలని అధికారులు సూచించారు. విద్యుత్ అంతరాయం ప్రభావిత ప్రాంతాలు: మంధైపల్లి రోడ్, వెంకటేశ్వర టౌన్‌షిప్, వెంకటేశ్వర కాలనీ, యమ్జల్ రోడ్, ఏస్ ఆలివ్ గార్డెన్, స్పోర్ట్స్ స్కూల్ పరిసరాలు, ఎన్‌సీఎల్ కాలనీ, ఎస్సీ కాలనీ, బ్యాంక్ కాలనీ, ఆర్టీసీ కాలనీ, ద్వారకాపురి కాలనీ, ఎంసీఆర్ కాలనీ తదితర ప్రాంతాలు. నిర్వహణ పనులు పూర్తయ్యిన వెంటనే విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తామని అధికారులు తెలిపారు.

